ప్రజాశక్తి
ఆదివారం 30 జూన్ 2024
5
విజయనగరం

డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాలు మేరకు డిఎస్‌సి ఎస్‌జిటి పరీక్షల సిద్ధమవుతున్న అర్హులైన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లాకు చెందిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, ఇడబ్ల్యుఎస్‌కు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎపి స్టడీ సర్కిల్ ఫర్ వెనుకబడిన తరగతులశాఖ డైరెక్టర్ కె.సందీప్‌కుమార్ తెలిపారు. ఉచిత శిక్షణకు జులై 1 నుంచి 8వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జులై 10 నుంచి 60 రోజులు పాటు ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం రెండు లక్షల రూపాయలు లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులుకు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకుఫోన్ నంబర్లు. 9603557333, 9177726454, 6301530356 ను సంప్రదించాలని తెలిపారు.



పెట్టుబడి సాయానికి ఎదురుచూపులు

ఆరుగాలం కష్టించినా... అక్కరకు రావడం లేదన్న అన్నదాత ఆవేదనకు ఈ ప్రభుత్వంలోనైనా అడ్డుకట్ట పడుతుందా..? అంటే అవునని చెప్పలేని పరిస్థితి. వర్షాలు అనుకూలిస్తే మరో వారం, పది రోజుల్లో ఖరీఫ్ సాగుకు అన్నదాత సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే విత్తనాలు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యాడు. కానీ ఇంతవరకు రైతన్న చేతిలో చిల్లిగవ్వ లేని దుస్థితి. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వం ఎన్నికల హామీ అమలు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

- ఖరీఫ్‌కు 'పెట్టుబడి' అందేనా?
- రూ.20 వేలు పెట్టుబడి అందిస్తామన్న టిడిపి ప్రభుత్వం
- బాసటగా నిలుస్తుందని రైతుల ఆశ

ప్రజాశక్తి - జామి

ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రైతు పెట్టుబడి నిధి కోసం ఏడాదికి రూ.20 వేలు చెల్లిస్తామని చెప్పిన మాట విదితమే. అందులో భాగంగానే ఖరీఫ్‌కు సాయం అందుతుందని రైతులు భావిస్తున్నారు. అదే జరిగితే, ఈ ఏడాది ఖరీఫ్ సాగు తాపీగా సాగుతుందని రైతులు అంటున్నారు. జిల్లాలో చిన్న, సన్నకారు రైతాంగమే అత్యధికం. గతంలో ఖరీఫ్ సాగును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందజేసి, పంట సాగుకు సాయపడేవి. కానీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో వైఎస్ఆర్ రైతు భరోసా కింద కేంద్ర ప్రభుత్వం నిధులు కలుపుకుని ఏడాదికి రూ.13,500 రైతు ఖాతాల్లో విడతల వారీగా జమ చేసింది. ఇలా అధికారం చేపట్టిన మొదటి ఏడాది 2019-20లో జిల్లాలో 2,03,451 మంది రైతులకు రూ.274.65 కోట్లు రైతుభరోసా కింద అందించిన ప్రభుత్వం... గతేడాది 2,63,414 మంది రైతులకు రూ.355.30 కోట్ల వరకూ అందజేసింది. గత ఐదేళ్లలో జిల్లా రైతాంగానికి వైసిపి ప్రభుత్వం రూ.1,629.35 కోట్లు అందజేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే నూతన ప్రభుత్వం ఏర్పడి, కొద్ది కాలమే అయినా, ఖరీఫ్ సాగు రానే వచ్చింది. ఈ నేపథ్యంలోనే సూపర్ సిక్స్ పథకాల్లో రైతు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని రైతులు ఎదురు చూస్తున్నారు.

బాసట దొరికేనా?

నూతన ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో ఖరీఫ్ సాగుపై సమీక్ష జరపాలని రైతులు ఆశిస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు తగిన నిల్వలు చేసుకోవాల్సిన నేపథ్యంలో వెనువెంటనే ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించి, పెట్టుబడి సాయంలో భాగంగా ఖరీఫ్ సాగుకు కొంత సాయమైనా అందించాలని కోరుతున్నారు. అదే జరిగితే, చిన్న, సన్నకారు రైతులకు కొంత బాసట ఉంటుందని భావిస్తున్నారు.

కౌలుదారుకు సాయం?

జిల్లాలో వేలాది మంది కౌలురైతులు సాగు చేస్తున్నారు. కానీ గత ప్రభుత్వాలు కౌలురైతుల గుర్తింపు విషయంలోనూ తాత్సరం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా కౌలురైతుకు పెట్టుబడి సాయం కింద ప్రకటించిన రూ.20 వేలు అందేలా కూటమి ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించాలని కౌలుదార్లు కోరుతున్నారు. అప్పుడే జిల్లాల్లో అన్నదాతకు నిజమైన పెట్టుబడి సాయం అందుతుందని రైతు సంఘాల నాయకులు, రైతులు భావిస్తున్నారు.

గత ఐదేళ్లలో జిల్లాలో రైతు భరోసా అమలు

సంవత్సరం	రైతులు	అందిన నిధులు (రూ.కోట్లలో)
2019-20	2,03,451	274.65
2020-21	2,39,363	323.14
2021-22	2,46,438	332.69
2022-23	2,51,659	343.55
2023-24	2,63,414	355.30
	మొత్తం	రూ.1629.35 కోట్లు

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

రైతులకు సకాలంలో విత్తనాలు అందించాలి ● జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మలేరియా, డెంగ్యూ, డయేరియా తదితర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అరికట్టేందుకు అన్నిరకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. స్థాయి సంఘ సమావేశాలు జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం జరిగాయి. 1,2,3,4,7వ స్థాయి సంఘ సమావేశాలు జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన, 5వ స్థాయి సంఘ సమావేశం ఆ సంఘ ఛైర్‌పర్సన్ ఎస్.శాంతకుమారి అధ్యక్షతన, 6వ స్థాయి సంఘ సమావేశం ఛైర్మన్ కొర్రజన్ని సింహాచలం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకున్నారు.

ముందుగా వైద్యారోగ్యశాఖపై సమీక్షలో భాగంగా సీజనల్ వ్యాధులను అరికట్టడానికి తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై చర్చ జరిగింది. సాధారణంగా ఏ ప్రాంతంలో ఎక్కువగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయో, ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను జెడ్‌పి ఛైర్మన్ ఆదేశించారు. ముఖ్యంగా మలేరియా వ్యాప్తి చెందే గిరిజన ప్రాంతాల్లో దోమల నివారణా చర్యలను వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రత్యేక పారిశుద్య కార్యక్రమాలను నిర్వహించి, కాలువల్లో మురుగునీరు లేకుండా చూడాలని, దోమల నివారణా మందులు పిచికారీ చేయడంతోపాటు, ఫాగింగ్ చేపట్టాలని, చెరువులు, మురికిగుంటల్లో గంబూషియా చేప పిల్లలను వేయాలని సూచించారు. అల్లూరి జిల్లాలోని అనంతగిరి మండలంలో ఎక్కువగా మలేరియా ఉందని, ఆ ప్రాంత అధికారులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చూడాలని, ప్లేట్‌లెట్స్‌ను కూడా అందుబాటులో ఉంచాలని చెప్పారు. బాడంగి, గజపతినగరం, మక్కువ జెడ్‌పిటిసి సభ్యులు తమ ప్రాంతంలోని సమస్యలను వివరించారు.

వర్షాలు సక్రమంగా కురుస్తున్నందున, రైతులు విత్తనాలకు, ఎరువులకు ఇబ్బంది పడకుండా చూడాలని వ్యవసాయశాఖాధికారులను చైర్మన్ ఆదేశించారు. ముందుగానే విత్తనాలు, ఎరువులను తరలించి, ఆర్‌బికెల్లో, గోదాముల్లో రైతులకు పంపిణీ చేసేందుకు వీలుగా అందుబాటులో ఉంచాలన్నారు. సొసైటీలకు పాలకవర్గాలు లేనందున, ఎరువుల పంపిణీలో దుర్వినియోగం జరగకుండా, సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖకు సంబంధించిన అంశాలపై శాంతకుమారి, . సాంఘిక సంక్షేమశాఖలకు సంబంధించిన అంశాలపై కె.సింహాచలం సమీక్షించారు. ప్రవేశాలు, ఫలితాలు, అవసరాలను బట్టి బిసి సంక్షేమశాఖకు చెందిన 3, సాంఘిక సంక్షేమశాఖకు చెందిన 3 ప్రభుత్వ ప్రీమెట్రిక్ హాస్టళ్లను ఎంపిక చేసి, వాటి అభివృద్ధికి ప్రణాళికలను రూపొందిస్తే నిధులను మంజూరు చేస్తామని జెడ్‌పి చైర్మన్ హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంఎల్‌సి డాక్టర్ సురేష్‌బాబు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిప్యూటీ సిఇఒ రాజ్‌కుమార్, రెండు జిల్లాల జెడ్‌పిటిసి సభ్యులు, కమిటీ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడొద్దు

కార్పొరేషన్ అధికారులతో ఎమ్మెల్యే అదితి ● నగరాభివృద్ధికి సమన్వయంతో కృషి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దోమల నివారణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదితి, మేయర్ విజయలక్ష్మి

విజయనగరం అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, పాలకవర్గం అంతా సమన్వయంతో కలిసి కషి చేద్దామని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. బెదిరింపులకు భయపడవద్దని అఆన్నరు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారి నగరపాలక సంస్థ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యేకు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు శ్రావణి, లయ యాదవ్, కమిషనర్ ఎంఎం నాయుడు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో ముందుగా అధికారులను, ఉద్యోగులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఇంజినీరింగ్ శాఖ, టౌన్ ప్లానింగ్ శాఖా, ప్రజారోగ్య శాఖ, రెవెన్యూ శాఖ పని తీరును, చేయాల్సిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర ప్రజలు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, విద్యుత్ అంతరాయం అధిగమించేందుకు కృషి చేద్దామని అన్నారు. కొన్ని ఫిర్యాదులు, బెదిరింపులు వస్తున్నాయని, వాటికి భయపడకుండా బాధ్యతతో పనిచేయాలని సూచించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఐదేళ్ల క్రితం గత పాలకవర్గం సమయంలో సోనీనగర్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు తయారు చేస్తే దాన్ని గత వైసిపి పాలకులు బుట్టదాఖల చేశారన్నారు. ద్వారపూడి వద్ద సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను అదే విధంగా నిర్వీర్యం చేశారన్నారు. కేంద్రం సహకారంతో వీటిని పునరుద్ధరిస్తామని తెలిపారు. ప్రజలు తన దృష్టికి వచ్చినవి మీకు తెలియచేసి వాటిని పరిష్కరించేందుకు కృషి చేద్దామన్నారు. అనంతరం దోమల నివారణకు ప్రజారోగ్య శాఖ ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు శ్రావణి, లయ యాదవ్, కమిషనర్ ఎంఎం నాయుడు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి కథనాలకు స్పందన

చర్యలకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శ్రీచైతన్య కళాశాలపై 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనం

పత్రికల్లో వస్తున్న కథనాలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందిస్తున్నారు. ప్రజాశక్తిలో వరుసగా శుక్ర, శనివారాల్లో వచ్చిన కథనాలపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 'కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల విక్రయాన్ని అరికట్టాలి', విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం' అనే శీర్షికలతో వచ్చిన కథనాలకు ఆయన స్పందించారు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని తనకు నివేదించాలని ఆదేశించారు.

పుస్తకాలు విక్రయించే ప్రయివేట్ స్కూళ్లపై చర్యలు

విజయనగరం టౌన్ : జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్య పుస్తకాలు మినహా ఇతర పుస్తకాలు విక్రయిస్తే ఆయా పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వానికి 5 శాతం రుసుం చెల్లించి నిర్దేశించిన విక్రయశాలల్లో కొనుగోలు చేసిన పుస్తకాలను మినహా మరే పుస్తకాలు విద్యార్థులకు కొనుగోలు చేయాలని సిఫారసు చేయరాదని స్పష్టంచేశారు.

మొదటి రోజే 90 శాతం పింఛన్ల పంపిణీ

పాత పాస్ పుస్తకాల స్థానే రశీదులు : కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

వెబెక్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

అత్యంత ప్రతిష్టాత్మకంగా పెంచిన పింఛన్లను ప్రభుత్వం జులై నుండి పంపిణీ చేస్తున్నందున పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఎంపిడిఒలను, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. 1వ తేదీన ఉదయం 6 గంటలకే పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలని సూచించారు. మొదటి రోజునే 90 శాతం పైగా పంపిణీ జరగాలన్నారు. శనివారం కలెక్టర్ వెబెక్స్ ద్వారా పింఛన్ పంపిణీ ఏర్పాట్లపై ఎంపిడిఒలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 నుండి 60 మంది లబ్ధిదారులకు ఒక అధికారిని కేటాయించామని, బయో మెట్రిక్ విధానం లో 7 వేల రూపాయల నగదును లబ్ధిదారుకు అందించి వారి నుండి రసీదును పొందాలని సూచించారు. పాత పింఛన్ పుస్తకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని, అలా వినియోగిస్తే సంబంధిత ఎంపిడిఒపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ కు, పంచాయతీ సెక్రటరీలకు పింఛన్ పంపిణీపై ఎంపిడిఒలు ప్రభుత్వ నిబంధనలు వివరించి అవగాహన కలిగించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి కార్యక్రమం కావున ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు.

నేటి నుంచి డైట్‌లో రెండో విడత కౌన్సిలింగ్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో రెండో దశ ప్రవేశాలకు ఆదివారం నుంచి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎన్.తిరుపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 30 నుంచి వచ్చే నెల నాలుగో తేది వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చని తెలిపారు. 5 నుంచి 7వ తేది వరకు సీట్ల కేటాయింపు ఉంటుందని, 8న ప్రవేశాల ఉత్తర్వులు జారీ చేస్తామని వెల్లడించారు. 9 నుంచి 13 వరకు చివరి ప్రవేశాలకు ధ్రువపత్రాల తనిఖీ చేసి 15న ప్రవేశాలు పూర్తిచేస్తామని చెప్పారు.

శారద కంపెనీ ప్రతినిధుల వితరణ

ప్రజాశక్తి-కొత్తవలస

కంటకాపల్లి వద్దగల శారదా కంపెనీ యాజమాన్యం కంటకాపల్లి హైస్కూల్ విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ శనివారం అందించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.అరుణ్ కుమార్ పిల్లలకు పంపిణీ చేశారు. శారదా కంపెనీ హెచ్ఆర్ డిజిఎం హెచ్.సన్యాసిరావు, హెచ్ఆర్ అసిస్టెంట్ మేనేజర్ శంకర్రావు, సంతోష్ వీటిని హైస్కూల్ హెచ్ఎంకు అందజేశారు.

దబ్బగుంటలో ఆర్‌డిఒ పర్యటన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గిరిజన గ్రామంలో పర్యటిస్తున్న ఆర్‌డిఒ సూర్యకళ

మండలంలోని గిరిజన గ్రామమైన దబ్బగుంటలో శనివారం ఆర్‌డిఒ సూర్యకళ పర్యటించారు. వివిధ శాఖల అధికారులతో వ్యాధుల వ్యాప్తిపై చర్చించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కిశోర్ ఆధ్వర్యంలో నీటి నమూనాలను సేకరించారు. ఎస్.కోట తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వ్యాధుల వ్యాప్తి నివారణ, సీజనల్ వ్యాధులు వంటి అంశాలపై సమీక్ష చేశారు. ప్రస్తుతం గిరిజన గ్రామాల్లో మలేరియా, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కొద్దిరోజుల క్రితం డిఎంహెచ్ఒ భాస్కరరావు దబ్బుగుంట గ్రామానికి వచ్చి వ్యాధుల వ్యాప్తిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో చర్చించారు. ఆయన వచ్చిన నాలుగు రోజుల వ్యవధిలో ఆర్‌డిఒ ఈ ప్రాంతానికి రావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. గత ఆర్నెల్లలో మండలంలోని గిరిజన గ్రామాల్లో వందకు పైగా మలేరియా కేసులు నమోదైనట్లు తెలిసింది. ఇటీవల 12 మలేరియా కేసులు వచ్చాయంటే, వ్యాధుల వ్యాప్తి ఏ విధంగా ఉందో అంచనా వేయొచ్చు. గతంలో ఈ ప్రాంతంలోని గిరిశిఖర గ్రామాల్లో సంభవించిన మరణాలపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఘనంగా ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు ఉద్యోగిని సత్కరిస్తున్న ఎస్‌పి దీపిక

జిల్లా పోలీసుశాఖలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన నలుగురు ఎస్ఐలు, 4 ఎఎస్ఐలు, ఒక ఎఆర్ హెచ్‌సి, ఒక పోలీసు కానిస్టేబులును (10మంది పోలీసు అధికారులను) జిల్లా ఎస్‌పి ఎం.దీపిక అభినందించారు. పోలీసుశాఖకు వారందించిన సేవలను కొనియాడి, శాలువలు, పూలమాలలు, జ్ఞాపికలు, బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎఆర్ డిఎస్‌పి డిఎస్‌పి యూనివర్స్, సిఐలు కెకెవి విజయనాథ్, ఇ.నరసింహమూర్తి, రాజశేఖర్, జె.మురళీ, ఆర్ఐలు ఎన్.గోపాల నాయుడు, భగవాన్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారం వచ్చే వరకూ.. ఆక్రమణలు గుర్తుకు రాలేదా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాజకీయం అంటే అధికారంలోవున్నా లేకున్నా ప్రజల తరపున పోరాడేది. ఇంకా చెప్పాలంటే ప్రజలకు సేవచేసేది. అలాగని పార్లమెంటరీ రాజకీయాలు అవసరం లేదని కాదు. కానీ, ప్రజాసమస్యల పట్ల స్పందించేందుకు, పాలకుల దోపిడీని నిలువరించేందుకు కేవలం అధికారం మాత్రమే ఉండాలనుకుంటే పొరపాటే. ఈ మాటకొస్తే రాజకీయాల్లోని లేనివారు కూడా చర్చకు వచ్చే అంశాలపై తమ వైఖరి కుండబద్ధలు కొట్టినట్టు తెలియజేస్తారు. వైసిపి కార్యాలయం వివాదం విషయంలో విజయనగరం ఎమ్మెల్యే, ఆమె అనుయాయులు, ఆ పార్టీ నాయకుల వైఖరి అందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. వైసిపి అధికారంలో వున్నప్పుడే విజయనగరం రింగురోడ్డుకు ఆనుకుని దాసన్నపేటలో జిల్లా పార్టీ కార్యాలయాన్ని నిర్మించిన సంగతి అందరికీ తెలిసిందే. తాజాగా టిడిపి అధికారంలోకి రావడంతో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆ కార్యాలయాన్ని సందర్శించి వైసిపిపై కీలక ఆరోపణలు చేశారు. అదితి వెంట జనసేన, బిజెపి నాయకులు కూడా ఉన్నారు. కార్యాలయ భవనం కోసం భూములు కబ్జాచేశారని, అనుమతులు కూడా తీసుకోకుండా నిర్మాణ పనులు చేపట్టారని అదితి చేసిన విమర్శ. ఇంతవరకు బాగానే ఉన్నా.... అసలు జిల్లా కేంద్రంలో హాట్‌కేక్ లాంటి రింగురోడ్డులో ఏకంగా మాన్సాస్ భూమి ఆక్రమించుకుంటే ఇన్నాళ్లు టిడిపి ఏమైపోయింది. ఎందుకు అడగలేదు. అందులోనూ మాన్సాస్ అంటే ఎమ్మెల్యే వారసత్వ ట్రస్ట్. అయినా సరే ఎందుకు నోరు మెదపలేదు? వైసిపి అధికారంలో ఉండడం వల్ల భయపడ్డారా? అప్పట్లో మనకెందుకు లే అనుకుంటూ రాజీపడ్డారా? అలాంటప్పుడెందుకు అంత ఉలుకుపాటు? ఇదీ అక్షరాలా జనం నోట వినిపిస్తున్న ప్రశ్నలు. ఇందుకు టిడిపి నాయకులు, ఎమ్మెల్యే అదితి సమాధానం చెప్పాలివుంది. నిజంగా టిడిపికి చిత్తశుద్ధి ఉంటే భూమిని కబ్జాచేసిన వారిపైనా, అధికార దుర్వినియోగానికి పాల్పడినవారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అందుకు టిడిపి సాహసిస్తుందా? జనం నుంచి వినిపిస్తున్న ధర్మ సందేహమిది. వాస్తవానికి వైసిపి అక్రమాలు నిజంగా బయటపెట్టి బోనులో నిలబెట్టాలనుకుంటే జగనన్న కాలనీలపేరిట సేకరించిన భూ వ్యవహారాలు పరిశీలిస్తే బోలెడన్ని అక్రమాలు బయటపడతాయి. ఇంకొంచెం ముందుకు వెళ్తే విజయనగరంలోనే అనేక చెరువులు మాయమయ్యాయి. ఇంకా చెప్పాలంటే దళితుల లబ్ధిపేరిట రెగ్యులైజేషన్‌కు వైసిపి ప్రభుత్వం చేసిన ఆర్డినెన్స్ ఓ భూదందా. ఫ్రీహోల్డ్ చేసిన భూములన్నీ వైసిపి నాయకుల చేతుల్లోకి వెళ్లాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో అయితే ఏకంగా వైసిపికి చెందిన బడా నాయకులే అడ్వాన్సులు ఇచ్చి వశపర్చుకున్నారు. ఇవన్నీ బయటకు తీసి, అక్రమార్కుల చిట్టా బయటపెట్టి, అమాయక దళితులకు అండగా నిలబడేంత చిత్తశుద్ధి ఉందా? అన్నది పబ్లిక్ టాక్. ఇవేవీ చేయకుండా ఊరకే వైసిపిపై ఆరోపణలతో కాలక్షేపం చేస్తే ప్రజావిశ్వాసాన్ని కోల్పోవడం తప్ప టిడిపికి కలిసొచ్చే అవకాశమేమీ లేదని పలువురు విశ్లేషిస్తున్నారు. గతంలో వైసిపి రాష్ట్ర నాయకుడు విజయసాయిరెడ్డి, జిల్లాకు చెందిన అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ కూడా మాన్సాస్ లెక్కలు తేలుస్తామంటూ తుస్సుమనిపించారు. టిడిపి కూడా అటువంటి హడావుడే చేస్తోందని, ఇరు పార్టీలో ఓ స్పష్టమైన అవగాహనతోనే పరస్పర ఆరోపణలు చేసుకోవడం పరిపాటేనని జనం చర్చించు కుంటున్నారు. తాజాగా ఎమ్మెల్యే అదితిచేసిన ఆరోపణలు రుజువని నిరూపించి చర్యలు తీసుకునేవరకు వెళ్లకపోతే ప్రజల్లో చులకనైపోయే ప్రమాదం లేకపోలేదని సాక్షాత్తు టిడిపి నాయకుల నోటే వినిపిస్తోంది.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

హామీ మేరకు పింఛను పెంపు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-గంట్యాడ

ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లను పెంపుదల చేసినట్లు రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం గంట్యాడలో టిడిపి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛనుదారుల గౌరవాన్ని పెంచడం కోసమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకొన్నారని తెలిపారు. పింఛన్లు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఎంతో భారమైనా లెక్కచేయకుండా హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జులై ఒకటో తేదిన సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేపడతారని చెప్పారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేస్తానన్నారు.

రాజీయే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ్‌చక్రవర్తి
- లోక్ అదాలత్‌లో 1863 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

రాజీయే రాజమార్గమని, కేసులను సామరస్య పూర్వకంగా, స్నేహ పూరిత వాతావరణంలో ఎటువంటి వివాదాలు లేకుండా పరిష్కరించే ఏకైక మార్గం లోక్ అదాలత్ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. జిల్లా కోర్టు సహా, ఉమ్మడిజిల్లాలోని అన్ని కోర్టుల్లోను శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాకుండా వారి జీవితాలలో మన: శాంతి కలిగి ఉంటారని అన్నారు. అదాలత్‌లో పలు సివిల్, క్రిమినల్ కేసులను రాజీ మార్గంలో ఇరు పార్టీల సమ్మతితో శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. ఈ సందర్భంగా విజయనగరంలో 1136, పార్వతీపురంలో 138, బొబ్బిలిలో 160, సాలూరులో 151, శృంగవరపుకోటలో 65, గజపతినగరంలో 91, చీపురుపల్లిలో 50, కొత్తవలసలో 53, కురుపాంలో 19 మొత్తంగా 1863 కేసులు పరిష్కరించారు. సుమారు రూ.15కోట్లను 6500 మంది కక్షిదారులకు చెల్లించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.రజని, ఎస్.దామోదరరావు, ఎం.మీనాదేవి, ఎన్.పద్మావతి, కె.నాగమణి, కె.విజయ కల్యాణి, హెచ్‌వి లక్ష్మి, టివిరాజేష్, ఎల్.దేవి రత్నకుమారి, బి.రమ్య, పి.బుజ్జి, ఎమ్. శ్రీనివాస రావు, ఎ.హరీష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, పోలీసు, ఇన్సూరెన్సు అధికారులు పాల్గొన్నారు. కోర్టు ఆవరణలో పిఎన్ రాజు, పంపాన రవి కుమార్, పి. కుమార స్వామి ఆధ్వర్యంలో కక్షి దారులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు.

కక్షిదారులకు ఆహారం వడ్డిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ్ చక్రవర్తి, న్యాయమూర్తులు

బొబ్బిలిలో 169 కేసులు రాజీ

బొబ్బిలి : స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 169 కేసులను రాజీ చేశారు. సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. మనీ సివిల్ కేసులు 26, టైటిల్ సివిల్ కేసులు 3, ఇపి కేసులు 14, చెక్ బౌన్స్ కేసులు 9, మెయింట్‌నెన్స్ కేసులు ఒకటి, పోలీస్ కేసులు 111, ఎక్సైజ్ కేసులు 13, ఇసుక కేసులు 9 రాజీ చేశారు. పెండింగులో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు లోక్‌అదాలత్ నిర్వహించినట్లు న్యాయమూర్తులు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

63 కేసులు పరిష్కారం

శృంగవరపు కోట : శృంగవరపుకోట కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి అధ్యక్షతన శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 63 కేసులను రాజీ చేశారు. వీటిలో సివిల్ కేసులు 19, చెక్కు బౌన్స్ కేసులు 9, క్రిమినల్ కేసులు 33, బ్యాంకు ప్రీ లిటిగేషన్ కేసులు 2 ఉన్నాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సూర్యదేవుడు, కార్యదర్శి బి.సత్యనారాయణ, ఎపిపి కేశవ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

సజావుగా పింఛన్ల పంపిణీ

ఎమ్మెల్యే లలితకుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జులై ఒకటో తేదీన పంపిణీ చేయబోయే పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలని 5 మండలాల ఎంపిడిఒలను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆదేశించారు. శనివారం లక్కవరపుకోట మండల కేంద్రంలో ఐదు మండలాల ఎంపిడిఒలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అత్యంత ప్రతిష్టాత్మంగా తీసుకున్న పెంచిన పింఛన్లను జులై 1 పంపిణీ చేస్తున్నందున సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు టిడిపి నాయకులను భాగస్వామ్యం చేసుకొని పింఛన్ల కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. మొదటి రోజే 90 శాతం పంపిణీ పూర్తి కావాలలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ ఎంపిపి కొల్లి రమణమూర్తి, మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, ఖాసాపేట సర్పంచ్ కోళ్ల భూపాల్ నాయుడు, ఎంపిడిఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం లేకుండా చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

నీట్ ప్రశ్నపత్రాలు లీకవడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని, వారి భవిష్యత్తుకు నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాలు లీక్ చేసి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లీకేజీపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కానివ్వొద్దని కోరారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే బేబినాయన

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. కౌన్సిల్ సమావేశానికి హాజరైన బేబినాయనకు కమిషనర్ రామలక్ష్మి, మేనేజర్ శివప్రసాద్, అధికారులు, కౌన్సిలర్లు ఘనంగా స్వాగతం పలికారు. మున్సిపల్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా బేబినాయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు విస్తరణ చేస్తామని, పాడైపోయిన రోడ్లు బాగు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రోజురోజుకు పట్టణం విస్తరిస్తోందని చెప్పారు. నూతనంగా ఏర్పడిన కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి పైలెట్ ప్రాజెక్టు స్కీమ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలని కౌన్సిల్ సభ్యులకు సూచించారు.

అజెండాపై టిడిపి కౌన్సిలర్ల ఆగ్రహం

మున్సిపల్ అజెండాపై టిడిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అభివృద్ధి పనులకు సాధారణ నిధుల నుంచి రూ.1.45 కోట్లు కేటాయించి గతంలో టెండర్ దక్కించుకుని అభివృద్ధి పనులు చేయని కాంట్రాక్టర్ శేషుబాబుకు టెండర్ ఇవ్వడంతో వారు మండిపడ్డారు. అజెండాపై డీసెంట్ నోటీసు ఇచ్చారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి

బొబ్బిలిరూరల్ : ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి శంబంగి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి తొలిసారిగా హాజరైన ఎమ్మెల్యేకు ఎంపిపి ప్రతినిధి శంబంగి వేణుగోపాల్ నాయుడు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు పనిచేయాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని సూచించారు. త్వరలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని, కాలువలు, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపిపి వివిధ శాఖలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ త్రినాథనాయుడు, వైఎస్ ఎంపిపి శంకర్రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్లను కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా గుర్తించాలి

బొబ్బిలి : మహాత్మా జ్యోతిభా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న గెస్ట్ టీచర్లను కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా గుర్తించాలని ఆ యూనియన్ నాయకులు టి.సంజీవి, ఎ.పైడిరాజు, బి.సన్యాసినాయుడు కోరారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా గుర్తించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. ఎన్నోఏళ్ల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 1035 మంది పని చేస్తున్నామని, అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా గుర్తించి టైమ్‌స్కేల్ అమలయ్యేలా చూడాలని కోరారు.

కార్యకర్త కుటుంబానికి బేబినాయన పరామర్శ

రామభద్రపురం : మండల పరిధిలోని మామిడివలస గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త నడుపూరి చిన్నంనాయుడు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో అతని కుటుంబాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన శనివారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తన పుట్టినరోజు వేడుకల్లో ఎంతో సరదాగా పాల్గొని ఆమరునాడే చిన్నంనాయుడు మతిచెందడం ఎంతో బాధాకరమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు, కనిమెరక శంకరరావు, వసంతుల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలియజేశారు.

- ప్రజాశక్తి, శృంగవరపుకోట

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే మాధవికి సత్కారం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఎమ్మెల్యే లోకం మాధవిని అలుగోలుకు చెందిన మాజీ ఎంపిటిసి కురిమినేని దివాకర్, టిడిపి గ్రామ అధ్యక్షులు ఆల్తి బాబూరావు శనివారం సత్కరించారు. అలుగోలు గ్రామదేవతల ఆలయాల సందర్శనకు ఆహ్వానించారు. గ్రామానికి తప్పకుండా వస్తానని, మొక్కులు తీర్చుకుంటానని ఎమ్మెల్యే చెప్పినట్లు వారు తెలిపారు.

విద్యార్థులతో చదివిస్తున్న ఎంఇఒ బాల భాస్కరరావు

పాఠశాలల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, కరకవలస, వెల్దాం ప్రాథమిక పాఠశాలలను శనివారం ఎంఇఒ పి.బాలభాస్కరరావు పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల వాతావరణం పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ పరిశీలనలో సిఆర్‌పి రాంప్రసాద్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఇఒ గంగరాజు

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - జామి

మండల కేంద్రంలో నెయ్యిలవీధిలోని ఎంపిపి పాఠశాలను ఎంఇఒ గంగరాజు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభిప్రాయం తెలుసుకున్న ఆయన, అక్కడే పిల్లలతో కలిసి భోజనం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన వర్కర్లకు, పాఠశాల ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు.

రికార్డు అసిస్టెంట్‌కి సన్మానం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఆర్. అప్పల నాయుడిని ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆర్‌ఐఒ ఎం. ఆదినారాయణ, రిటైర్డు డివిఇఒ కె.విఠల్, సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు

సేవ చేసే అవకాశం రావడం అదృష్టం

జిల్లా సహకార ఆడిట్ అధికారి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం చాలా అదృష్టంగా భావిస్తానని జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎస్.అప్పలనాయుడు తెలిపారు. సుమారు 16ఏళ్ల పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖల్లో పనిచేయడం వలన గ్రామీణ ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందని చెప్పారు. ఉద్యోగ జీవితం ప్రారంభంలో విడిఒ గా అరేళ్లు పని చేసినపుడు పేదలకు సంక్షేమ పథకాలు నేరుగా అందించడం, డ్వామాలో పనిచేసినపుడు మౌలిక సదుపాయాలు కల్పించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఈనెల 30న ఉద్యోగ విరమణ చేస్తున్న తన ఉద్యోగ జీవిత విశేషాలను ప్రజాశక్తితో పంచుకున్నారు.

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం అనంతవరం గ్రామంలో సబ్బవరపు సన్నిబాబు, పాపమ్మ దంపతులకు నేను నాలుగో సంతానం. తనకు ఇద్దరు అక్కలు, ఒక అన్నయ్య ఉన్నారు. మాది వృత్తి రీత్యా వ్యవసాయ కుటుంబం. అన్నయ్య తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్ అయ్యారు. నా ప్రాథమిక విద్య అనంతవరంలో సాగింది. ఆరు నుంచి పదోతరగతి వరకు విజయనగరంలోని కస్పా హైస్కూల్‌లో పూర్తి చేశాను. ఇంటర్ ఎస్.కోటలోను, డిగ్రీ ఎంఆర్‌కాలేజీ, పిజి ఎయులో, బిఇడి భీమవరంలో పూర్తి చేశాను.

1989లో విడిఒగా గంట్యాడ మండలంలో జాయిన్ అయి 1995 వరకు పనిచేసి అదే ఏడాది గ్రూప్ 2 ద్వారా సహకార శాఖ లో ఎంపికై పార్వతీపురం డివిజన్ ఆఫీస్‌లో కో-ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్‌గా జాయిన్ అయ్యాను. పది నెలల్లో విజయనగరం డివిజన్ ఆఫీస్‌కు బదిలీ పై వచ్చి 1999 వరకు పనిచేసి అదే ఏడాది విజయనగరం డిసిఒ ఆఫీస్‌కు సూపరింటెండెంట్ క్యాడర్‌లో వచ్చి 2006 వరకు పనిచేశాను. అదే ఏడాది డ్వామా లో ప్రోగ్రామ్ ఆఫీసర్ గా 2007 వరకు పనిచేసి అక్కడ నుంచి డ్వామా పీడీ ఆఫీస్ లో పరిపాలనాధికారిగా చేరాను. 2010 వరకు పని చేసి అదే ఏడాది జిల్లా సహకార అధికారిగా వెళ్లాను. 2011లో డ్వామా అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా 2016 వరకు పనిచేసాను. ఈ కాలంలో మూడుసార్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ గా అదనపు బాధ్యతలు నిర్వహించాను. మళ్లీ జిల్లా సహకార ఆడిట్ అధికారిగా వచ్చి ఇప్పటి వరకు కొనసాగాను. ఈ కాలంలో 2020 నుంచి 2022 వరకు డిసిఒగా అదనపు బాధ్యతలు చూశాను.

అవార్డులు...ప్రశంసలు

జిల్లాలో పది సార్లు అవార్డులు వచ్చాయి. ఇందులో ఏడు సార్లు డ్వామాలోను, మిగతా మూడు సార్లు సహకార శాఖలో వచ్చాయి. 2012, 2014లో రెండు సార్లు రాష్ట్ర స్థాయి అవార్డులు పీడీగా ఉన్నప్పుడు క్యాష్ అవార్డు, విశాఖ సమాచారం వారు ఇచ్చే ఉగాది పురస్కారం లభించాయి.

సంతృప్తి నిచ్చే అంశాలు

గ్రామీణ అభివృద్ధి లో పని చేసినప్పుడు ప్రజలకు దగ్గరుండి సేవ చేయడం, డ్వామా లో పనిచేసినపుడు రెండు సార్లు జాతీయ అవార్డులు రావడం రాష్ట్ర స్థాయి లో అరుసార్లు అవార్డులు రావడం జిల్లాలో వంద సోషల్ ఆడిట్ సభల్లో పాల్గొని సభలు నిర్వహించడం నేను మరచిపోలేనవి. నా ఉద్యోగ జీవితం విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన పై అధికారులకు, సహచర ఉద్యోగలకు, ఇతర సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

శాసన మండలి సభ్యులు పెనుమత్స సురేష్ బాబు శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

శ్రీనివాస్ మృతి బాధాకరం

బొబ్బిలి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిసిసి మాజీ అధ్యక్షులు డి.శ్రీనివాస్ మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటలో విచారం వ్యక్తంచేశారు. మంత్రిగా, పిసిసి అధ్యక్షులుగా పని చేసిన శ్రీనివాస్ కాంగ్రెస్ బలోపేతానికి పని చేశారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బోటు ప్రమాద బాధితులు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని తీర ప్రాంతమైన ముక్కాం గ్రామానికి చెందిన బోటు ప్రమాద బాధితులు ఎమ్మెల్యే లోకం మాధవిని ఆమె క్యాంప్ కార్యాలయంలో శనివారం కలిశారు. కారి అప్పయ్యకు చెందిన రూ.35 లక్షలు విలువైన బోటు ఇటీవల విశాఖపట్నం జిల్లా పూడిమడక వద్ద అగ్ని ప్రమాదానికి గురై కాలిపోయింది. ఈ సందర్భంగా నష్టపరిహారం వచ్చేలా చూడాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. మత్స్య శాఖ అధికారులతో మాట్లాడి నష్ట పరిహారం వచ్చేలా ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల లీగల సెల్ అధ్యక్షులు గరికిన రాములు, టిడిపి నాయకులు కోల గురువులు, చల్లపల్లి అప్పన్న, గనగళ్ల గరగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ఎమ్మెల్సీ సురేష్ బాబు

ప్రజాశక్తి - జామి

పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు తక్కువ సమయంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్సీ సురేష్ బాబు సూచించారు. జామి మండలం అట్టాడ బి.ఎన్.ఆర్ ఆశ్రమంలో శనివారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల పురస్కార సభలో ఆయన మాట్లాడారు. 1979లో జామి హైస్కూల్లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల బృందం 2024లో జామి మండల స్థాయిలో పదో తరగతిలో ఉన్నత శ్రేణిలో పాసైన విద్యార్థులకు సత్కరించటం గొప్ప విషయమన్నారు. ఇది మంచి సంప్రదాయమని అన్నారు. విద్యార్థులకు ప్రస్తుతం మంచి అవకాశాలు ఉన్నాయని, సెల్‌ఫోన్లో సమయం గడపకుండా, టీవీలకు దూరంగా, పుస్తకాలకు దగ్గరగా ఉంటే త్వరలోనే గొప్ప స్థాయికి చేరుకుంటారని చెప్పారు. తల్లిదండ్రులు కూడా పిల్లల సామర్థ్యంపై అంచనాలు వెయ్యాలని కోరారు.

లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ హైస్కూల్లో పదో తరగతి ఎక్కువ మార్కులతో పాసైన విద్యార్థులను సత్కరించి వారిలో దాగి ఉన్న ప్రతిభను తట్టి లేపాలనే ఆలోచన.. తన తోటి మిత్రులకి రావడం, ప్రతి సంవత్సరం ఇదే ఆశ్రమంలో జామి మండలంలోని ఏడు హైస్కూళ్లలోని విద్యార్థులను సత్కరించటం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ప్రభుత్వం కూడా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల కు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉందని భీశెట్టి అన్నారు. కుమరాం హైస్కూల్, కెజివిబి, కుమరాం, లొట్లపల్లి, అలమండ బాలురు, బాలికల, జామి, విజినిగిరి పాఠశాలల విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా ఘనంగా సత్కరించారు ఈ సమావేశంలో విశ్రాంత వయోజన విద్యా అధికారి జె.రామచంద్రరాజు, పెదతాడివాడ ప్రధానోపాధ్యాయుడు వి.వి.ఎ.నరసింగరావు, శారదా విద్యానికేతన్ అధినేత వాడ్రేవు శ్రీనివాసరావు, ఎన్.వి.ఎన్ బ్లడ్ బ్యాంకు అధినేత తాడేపల్లి నాగేశ్వరరావు, మాతృభూమి సేవాసంఘ అధ్యక్షుడు ఇప్పలవలస గోపి, ఆల్ల శిరీష, ఆల్ల లోకేష్, డాక్టర్ భార్గవి, హరితా సాయి,తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ మధుసూదనరావు

ప్రధానోపాధ్యాయులతో సమీక్ష

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఇఒ జె.త్రినాథరావు ఆధ్వర్యాన శనివారం సమీక్ష నిర్వహించారు. ఎంపిడిఒ బి.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఈ సంవత్సరానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ 25 రకాల ప్లాన్లు ఇచ్చామని, సక్రమంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

నేడు వేపాడ మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆదివారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నిశ్చల ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.సత్యవంతుడు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.